క్లుప్తంగా

బాధితుల పరామర్శ



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం కంభంపాడు గ్రామంలో ప్రమాదవశాత్తు మంటలు ఎగసిపడి సుమారు 20 ఎకరాల పంట నష్టం జరగ్గా విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులైన తోట హనుమయ్య, తోట నాగాంజనేయులు, గుత్తి చెలమయ్య, అడపాల హనుమంతరావు, సంకుల శ్రీను, కె.గోపి. బి.చెంచమ్మ, శ్రీనుబాబులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా బొల్లా మాట్లాడుతూ అగ్నిప్రమాదంలో దగ్ధమైన సుమారు 20 ఎకరాలకు రూ.20 క్షల మేర ఆస్తినష్టం సంభవించిందని బాధితులు తెలిపారని, బాధితులను ప్రభుత్వం తరపున ఆదుకుంటామన్నారు.

69 శాతం ఇంటి పన్ను వసూలు

శావల్యాపురం: ఇంటి పన్నులు వసూలు పురోగతి పెంచాలని ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీలు ఉండగా వరకు రూ. 43 లక్షల 26 వేల 204 రూపాయలు బకాయిలు ఉండగా ఇప్పటి వరకు రూ.30 లక్షల 23 వేల 428 రూపాయలు పంచాయతీ కార్యదర్శులు సామర్థ్యంలో వసూలు చేయగా 69 శాతం అయిందన్నారు. నూరుశాతం వసూలు అయ్యేలా క్షేత్రస్థాయిలో ప్రజల్లో చైతన్య వంతులను చేయాలన్నారు. వసూలు చేసిన నిధులన్నీ పంచాయతీలో మౌలిక వసతుల కల్పనతో పాటు గ్రంథాలయాల్లో 8 శాతం నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఈవోపీఆర్డి పి.సుగుణ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

14న హైదరాబాద్‌లో ఆత్మీయ సమావేశం

నరసరావుపేట: హైదరాబాదు నిజాంపేట రోడ్డులోని కొలను రాఘవరెడ్డి గార్డెన్స్‌లో ఈనెల 14వ తేదీ ఆదివారం ఉదయం పదిగంటలకు నరసరావుపేట వాసులతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. ఎన్నికలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ సమావేశానికి హైదరాబాదులో నివాసం ఉంటున్న నరసరావుపేటకు చెందిన నియోజకవర్గ ప్రజలు, సాఫ్ట్‌వేర్, ఇతర ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, మహిళలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు, సోషల్ మీడియా ప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, చైర్మన్లు, సంఘాల ప్రతినిధులు అందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు

గాజు క్లాత్ నిందితుడికి ఏడాది జైలు

నరసరావుపేట టౌన్: నాణ్యతలేని గాజుక్లాత్ తయారీకు పాల్పడ్డ జి.కె. సర్జికల్స్ యజమానిపై నేరం రుజువు కావటంతో ఏడాది జైలు శిక్ష, రూ.20 వేల రూపాయల జరిమాన విధిస్తూ మొదటి అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ టి. ప్రవల్లిక శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన జి.కె. సర్జికల్స్ యాజమాన్యం నాసిరకం గాజుక్లాత్‌ను తయారు చేసి నరసరావుపేట పట్టణంలోని పలు సర్జికల్ దుకాణాలకు సరఫరా చేసింది. సమాచారం అందుకున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ 2017 సంవత్సరంలో దుకాణాలపై దాడులు నిర్వహించి నిల్వలను సీజ్ చేశారు. ఈ మేరకు జి.కె. సర్జికల్ యజమాని తిరుకాళిముత్తు ఇరంగవశన్‌పై కేసు నమోదు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువుకావటంతో న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడ్ని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార శుక్రవారం తెలిపారు. గురవాయిపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్నా సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ 10 మద్యం బాటిళ్లు కలిగి ఉన్న బి. రాహేలును అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడ్ని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు

నాదెండ్ల: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జాతీయ రహదారిపై గణపవరం వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, రాజకీయ నాయకుల ఫోటోలతో ఉన్న పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆటోను గుర్తించామన్నారు. నిబంధనల మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై రాజకీయ నేతలు, పార్టీ సింబల్స్ తదితర చిత్రాలు ఉండకూడదని తెలిపారు.

బీసీలకు ప్రాధాన్యత ఇచ్చింది వైఎస్సార్ సీపీనే

- 26వ వార్డులో పార్టీలో చేరిన 30 కుటుంబాలు
- కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలో బీసీల పక్షపాతిగా ఉన్న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ఆ వర్గీయులపైనే ఉందని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి 26వ వార్డుకు చెందిన 30 కుటుంబాలకు చెందిన బీసీ వర్గీయులు టీడీపీని వీడి డాక్టర్ గోపిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత యాభై ఏళ్ల రాష్ట్ర చరిత్రలో బీసీలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేసేందుకు అసెంబ్లీ అభ్యర్థులుగా 48 మందికి, 11 పార్లమెంటు స్థానాలను బీసీలకు కేటాయించారన్నారు. ఎమ్మెల్సీలుగా మొత్తం 17 మందిలో 11 మందికి బీసీలకు ఇచ్చారన్నారు. మంత్రివర్గంలో పదిమందికి పదవులు ఇచ్చారని, 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారన్నారు.
రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పిస్తే అన్నింటిలోను బీసీలు రాణిస్తారన్నారు. గతంలో నరసరావుపేట పార్లమెంటు సీటు ఏనాడు బీసీలకు కేటాయించలేదని, ఆ స్థానాన్ని ఇప్పుడు సీఎం జగన్ బీసీలకు కేటాయించారన్నారు. బీసీలు అంటే బ్యాక్‌బోన్‌లుగా సీఎం జగన్ నమ్మారన్నారు. రొంపిచర్ల మార్కెట్ యార్డు పదవిని తొలిసారిగా వడియరాజులకు ఇచ్చామని, మరో బీసీ యాదవ వర్గీయుడైన మోరబోయిన శ్రీనివాసరావు భార్యకు నరసరావుపేట ఎంపీపీ పదవి ఇచ్చామన్నారు. నియోజకవర్గంలో అత్యధిక ప్రాధాన్యత బీసీలకు ఇస్తున్నామన్నారు. ఐపిటీ విద్యార్థులు చేసిన సర్వేలో 110 సీట్లతో మళ్లీ అధికారంలోకి వైఎస్సార్‌సీపీ రానున్నదని వెల్లడించారు. అందరూ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చల్లా శ్రీనివాసరావు, పట్టణ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు వేముల శివ, మోరబోయిన శ్రీనివాసరావు, షేక్ మాబు, షేక్ నాగూర్ మీరావలి, చిన్ని శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన బీసీ వర్గీయులతో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి, ఇతర నాయకులు

వైఎస్సార్ సీపీలోకి 20 కుటుంబాలు చేరిక

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఈపూరు మండలం ఊడిజర్ల తండాకు చెందిన 20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీలో చేరిన వారందరినీ వైఎస్సార్ సీపీ కుటుంబసభ్యులుగా చూస్తామని, రానున్న రోజుల్లో పార్టీలో సముచిత స్థానం కల్పిస్తాని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా అనిల్‌కుమార్‌యాదవ్‌ను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన ఊడిజర్ల తండావాసులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా

సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేయండి

- ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి సతీమణి సుష్మితారెడ్డి
- 24వ వార్డులో ప్రచారం

నరసరావుపేట: రాష్ట్రంలో అన్నీ వర్గాల అభివృద్ధి, పేదవర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సతీమణి డాక్టర్ సుష్మితారెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం పట్టణంలోని 24వ వార్డులోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పలు అపార్టుమెంట్లు, వీధుల్లో ఓటర్లను స్వయంగా కలుసుకొని గత ఐదేళ్లలో నియోజకవర్గంలో నిర్వహించిన అభివృద్ధి, సంక్షేమం గురించి ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలను తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి సానికొమ్ము సుబ్బారెడ్డి, పొలిమేర వెంకటరెడ్డి, పూనూరి కోటిరెడ్డి, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



24వ వార్డు ప్రచారంలో పాల్గొన్న డాక్టర్ సుష్మితారెడ్డి

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటారు

ఈపూరు: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు ప్రిన్సిపాల్ సునీల్ చౌదరి శుక్రవారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో మొత్తం 33 మంది విద్యార్థులు హాజరు కాగా 17మంది, ద్వితీయ సంవత్సరంలో 45 మంది విద్యార్థులకు గాను 17 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మొదటి సంవత్సరంలో 51 శాతం, ద్వితీయ సంవత్సరంలో 38 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. మొత్తం 78 మంది విద్యార్థులకు గాను 34మంది పాస్ అయినట్లు తెలిపారు.

శావల్యాపురంలో బాలికల సత్తా...

శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాల ఇంటర్ మొదట సంవత్సరంలో 75 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈవిద్యా సంవత్సరంలో నూతనంగా బాలికల జూనియర్ కళాశాల ప్రభుత్వం మంజూరు చేయగా అందులో ఎంపీసీ గ్రూపులో 20 మంది విద్యార్థినులు, బైపీసీ విభాగంలో 13 మంది విద్యాభ్యాసం చేసినట్లు తెలిపారు. 33 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 25 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ఎంపీసీ విభాగంలో 15 మంది విద్యార్థినులు పాస్ కాగా అందులో మొదట స్థానం ఓర్పు జ్యోతి 470 మార్కులకు గాను 446 మార్కులు సాధించినట్లు తెలిపారు. రెండవస్థానం ఏలూరి పుష్పాలత-441, మూడోవ స్థానం గంపా దేవరాణి -438 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో 13 మంది విద్యార్థినులుగాను 10 మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి స్థానం మహిమారాణి 440 మార్కులుగాను 346 మార్కులు సాధించినట్లు చెప్పారు. ద్వితీయ స్థానం కోమ్మలపాటి నవ్య -330, తృతీయ స్థానం-మట్లూరి బావోజమ్మ -325 మార్కులు సాధించినట్లు చెప్పారు. నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలలో ఏడు మంది అధ్యాపక బృందం సహకారంతోనే ఈ విజయం సాధించినట్లు చెప్పారు.

నూజెండ్ల మోడల్ స్కూల్...

వినుకొండ (నూజెండ్ల): ఇంటర్మీడియట్ ఫలితాల్లో నూజెండ్ల మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో మొత్తం 51 మంది పరీక్షకు హాజరుకాగా 44 మంది ఉత్తీర్ణత సాధించడంతో 86.27 శాతం నమోదైందని, జూనియర్ ఇంటర్‌లో మొత్తం 72మందికి గాను 47 మంది పాసై 65.27 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో వూట్ల పావని వెయ్యి మార్కులకు గాను 954 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు.

బొల్లాపల్లి మోడల్ స్కూల్లో...

బొల్లాపల్లి : శుక్రవారం వెల్లడించిన ఇంటర్ ఫలితాల్లో మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వి.పద్మావతి తెలిపారు. సీనియర్ ఇంటర్ విద్యార్థులు 59 మందికి గాను 44 మంది పాసయ్యారని, సీనియర్ ఇంటర్‌లో 74.5 శాతం, జూనియర్ ఇంటర్‌లో 33కు గాను 21మంది పాసై 63 శాతం నమోదైందని ప్రిన్సిపాల్ తెలిపారు.

నాదెండ్ల మండలంలో....

నాదెండ్ల: చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాల, నాదెండ్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలోని విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. ఏపీ మోడల్ పాఠశాలలో 92 మంది విద్యార్థులకు గాను 75 మంది (82 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో ఎ.గౌరి 470కి గాను 424 మార్కులు, బైపీసీలో కె మేఘన 440కి గాను 424 మార్కులు సాధించింది. సీఈసీలో టి.కావేరి 437/500 మార్కులు, ఎంఈసీలో జె.విజయలక్ష్మి 383/500 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. సీనియర్ ఇంటర్‌లో 94 మందికి గాను 71 మంది (76 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో సీహెచ్.అఖిల 997, బైపీసీలో పొదిలిమ 976, సీఈసీలో ఎ దివ్య 819, ఎంఈసీలో వై. కావ్య 857 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ పి ఝాన్సీవాణి తెలిపారు. నాదెండ్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో జూనియర్ ఇంటర్‌లో 27 మంది పరీక్షకు హాజరు కాగా 18 మంది (67 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో....

వినుకొండ(నూజెండ్ల): ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ బైపీసీ చదువుతున్న డి. నాగాంజలి వెయ్యి మార్కులకు గాను 880 మార్కులు, సీనియర్ ఎంఎల్‌టీ విభాగంలో కోట స్వాతి నిహారిక 929 మార్కులు సాధించి కళాశాల టాపర్స్‌గా నిలిచారని ప్రిన్సిపాల్ ప్రభాకరరావు తెలిపారు. సీనియర్ ఇంటర్ జనరల్ సబ్జెక్ట్స్‌లో 91 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 41మంది, ఒకేషనల్ కోర్సులు 77 మందికి గాను 55 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో డి.ఆర్.ఆకాష్ విద్యార్థుల ప్రతిభ



విక్టరీ సింబల్ చూపుతున్న డి.ఆర్. ఆకాష్ విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: స్థాపించిన మొదటి సంవత్సరంలోనే ఇంటర్మీడియట్ పరీక్షల్లో సాధారణ విద్యార్థులతో జూనియర్ ఇంటర్ ఫలితాల్లో అసాధారణ ఫలితాలు సాధించినట్లు డి.ఆర్. ఆకాష్ విద్యాసంస్థల డైరెక్టర్‌లు లక్ష్మారెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాసరావు తెలిపారు. బోర్డు శుక్రవారం ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో జూనియర్ ఇంటర్‌లో 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించటంతో పాటు 6 విద్యార్థులు 460కి పైగా మార్కులు సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రిన్సిపల్ నీరజ్ మాట్లాడుతూ అగ్రగామి విద్యాసంస్థలు సైతం వెనక్కు నెట్టి డి.ఆర్. ఆకాష్ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు.

మార్కులు, ర్యాంకులు ప్రామాణికం కాదు

యడ్లపాడు: విద్యార్థికి మార్కులు, ర్యాంకులు ప్రామాణికం కాదని..విద్య అభ్యసించాలనే జిజ్ఞాసే ముఖ్యమని యడ్లపాడు ఫ్లస్‌టు జెడ్పీహైస్కూల్ విజయభారతి తెలిపారు. శుక్రవారం ప్రకటించిన ఫస్టియర్ ఇంటర్ పరీక్షా ఫలితాలలో తమ పాఠశాల నుంచి 34 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరయ్యారని, వారిలో10 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. పదో తరగతి పూర్తయ్యాకా చదువు ఆపేసిన, ఇంటర్‌లో చేరి మధ్యలో మానేసిన బాలికలను, వారి తల్లిదండ్రులను చైత న్యం చేసి పలు గ్రామాలకు చెందిన వారికి ఇక్కడ ప్రవేశాలను కల్పించడం జరిగిందన్నారు. అయితే అప్పటి వరకు తెలుగు మీడియంలో చదువుకొని తీరా ఇక్కడ ఇంటర్‌లో ఇంగ్లీష్ మీడియంలో చేరి ఉత్తీర్ణత కావడం అంత సులభం కాదన్నారు.
కాబట్టే ఉత్తీర్ణత శాతం తగ్గిందని వివరణ ఇచ్చారు. అదేవిధంగా ఒక సబ్జెక్టులో మాత్రమే తప్పిన వారు ఏడుగురికి పైగా ఉన్నారని, వీరంతా మే నెలలో జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు హాజరై తప్పక ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తామన్నారు. అందుకు సంబంధించి ప్రత్యేక తరగతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎంపీసీలో 13 మందికి గానూ ముగ్గురు ఉత్తీర్ణులు కాగా, బైపీసీలో 21 మందికి ఏడుగురు ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. అసలు విద్యకు దూరమైన గ్రామీణ బాలికల్ని కళాశాల వరకు తెచ్చి వారి ప్రతిభకు మెరుగు పెట్టి ప్రొత్సహించడమే ఫ్లస్‌టు హైస్కూల్ అంతిమ లక్ష్యంగా పేరెంట్స్ భావించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

నరసరావుపేట: సబ్‌స్టేషన్లలో చేపట్టాల్సిన అత్యవసర మరమ్మతులను పురస్కరించుకొని శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు శుక్రవారం వెల్లడించారు. ఈ మేరకు పట్టణంతో పాటు నరసరావుపేట మండలంలోని గ్రామాల్లో సరఫరా నిలిపివేయటం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని రూత్‌డైక్‌మెన్ కాలనీ, వేలూరు డొంక, తూర్పుమాలపల్లె, గుర్రాల చావిడి, రూరల్ పోలీస్ స్టేషన్ ఏరియా, గాంధీపేట, మున్సిపల్ ఆఫీస్ ఏరియా, ఎస్‌బీఐ నుంచి విజయాబ్యాంకు సెంటర్ వరకు సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రొంపిచర్లలో....

రొంపిచర్ల: మండలంలో అన్ని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఎఇ కె.రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిడుగురాళ్ళలోగల 220/132/33 కె.వి.విద్యుత్ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.
ఈ సందర్భంగా మండలంలో రొంపిచర్ల, మర్రిచెట్టుపాలెం, బుచ్చిబాపన్నపాలెం, సుబ్బయ్యపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో గల గ్రామాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. 3ఫేస్ విద్యుత్ శనివారం తెల్లవారుజామున 12 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు సరఫరా చేస్తామన్నారు.

సీనియర్ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

నరసరావుపేట రూరల్: పరీక్షల్లో ఫెయిల్ అయ్యాననే కారణంతో ఓ సీనియర్ ఇంటర్ విద్యార్థినీ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఇక్కుర్తి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం ఈర్ల అర్చన (17) పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియేట్ చదివి పరీక్షలు రాసింది. విడుదలైన ఫలితాల్లో ఫెయిల్ కావటంతో ఇంట్లో తల్లితండ్రులు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో తల్లితండ్రులు దుఃఖసాగరంలో మునిగిపోయారు.

బోయపాలెంలో గ్రామదేవతల ప్రతిష్ట

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామదేవతలు పోలేరమ్మ, పోతురాజుల విగ్రహాల పునఃప్రతిష్టా మహోత్సవం శుక్రవారం నిర్వహించారు. ప్రతిష్టను పురస్కరించుకుని గురువారం ఉదయం నుంచి హోమపూజలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం అమ్మవారి విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. ఉన్నవ గ్రామానికి చెందిన యాజ్ఞికులు పచ్చల సాయిబాబు పర్యవేక్షణలో వారి శిష్యబృందం ప్రతిష్టా కార్యక్రమాన్ని ఉదయం 9.17 గంటలకు దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠగావించారు. బోయపాలెం గ్రామ పెద్దలు, ప్రజలు సమష్టి సహకారంతో చే పట్టిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రతిష్టకు విచ్చేసిన భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

ప్రజల కోసం పనిచేసే బొల్లాను గెలిపించండి

ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు సతీమణి ఎన్నికల ప్రచారం

వినుకొండ (నూజెండ్ల): ప్రజలిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టించి, నిత్యం ప్రజల కోసం పనిచేసే ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును మరోమారు ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన సతీమణి బొల్లా ఆదిలక్ష్మి, కుమార్తె మణికుమారిలు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విజయాన్ని కాంక్షిస్తూ పట్టణంలోని 6వ వార్డులో వారు ప్రచారం నిర్వహించారు. తొలుత వినాయక మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వార్డు పరిధిలోని గృహాలను సందర్శించి బ్రహ్మనాయుడు చేసిన అభివృద్ధిని వివరిస్తూ మరో మారు బ్రహ్మనాయుడును గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యేగా బొల్లా బ్రహ్మనాయుడు పట్టణంలో ఎన్ఎస్‌పీ కెనాల్ రోడ్ల నిర్మాణం, స్టేడియం, కొండపై ఘాట్‌రోడ్డు, సింగరచెరువు అభివృద్ధి, తాగునీటి పైపులైన్ ఏర్పాటు, నూతన పాఠశాలల భవనాల నిర్మాణాలు ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని తెలిపారు. ఎమ్మెల్యేగా బొల్లా బ్రహ్మనాయుడును, ఎంపీగా పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా కుటుంబసభ్యులు ఆదిలక్ష్మి, మణికుమారి

అక్రమంగా మద్యం నిల్వ చేస్తే కఠిన చర్యలు

ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు

చిలకలూరిపేట: ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ నిల్వలు కలిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె శ్రీనివాసులు హెచ్చరించారు. పట్టణంలోని ఎస్ఈబీ స్టేషన్‌లో పట్టుబడిన మద్యం కేసులపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలకలూరిపేట ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 2,186 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకొని 97 కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఇప్పటి వరకు 78 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా అక్రమ మద్యం నిల్వచేసినా రవాణా చేసినా, విక్రయాలు చేసినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ మద్యానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే ఎస్ఈబీ స్టేషన్‌కు సమాచారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కె.ప్రభాకరరావు, స్టేషన్ హౌస్ ఆఫీసర్ వి.శశికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్ష చేస్తున్న డిప్యూటీ కమిషనర్ నివాసులు

ఐసీడీఏ టీ–20కు ఎంపికైన దివ్యాంగ క్రీడాకారుడు

యడ్లపాడు: ఐసీడీఏ టీ-20 దివ్యాంగుల ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌కు పల్నాడు జిల్లా యడ్లపాడుకు చెందిన దివ్యాంగ క్రీడాకారుడు చల్లగాలి రఘు ఎంపికయ్యాడు. గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ శ్రీనివాసరాజు, అంజనికుమారి దంపతుల కుమారుడు రఘు పుట్టుకతోనే వినికిడి, ఉచ్ఛరణ లోపం ఉన్నాయి. అయినా తల్లిదండ్రులు రఘుని కంటికి పాపలా ప్రేమగా పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చిన్ననాటి నుంచి రఘుకు క్రీడలంటే ఎంతో మక్కువ. అందులోనూ క్రికెట్ అంటే ప్రాణం. తమ బిడ్డ ఇష్టాన్ని గుర్తించిన తల్లిదండ్రులు క్రీడాసామగ్రిని ఇప్పించి అందులో రాణించేందుకు తర్ఫీదును ఇప్పించారు. దీంతో పలు రాష్ట్రాల దివ్యాంగుల రంజీ క్రికెట్ మ్యాచ్‌లో రఘు పాల్గొని రాణించాడు. ఆయా మ్యాచుల్లో అద్భుత ప్రతిభను చాటి జట్టు విజయానికి ఎంతో దోహదపడ్డాడు. ఇప్పటివరకు 29 రంజీ మ్యాచ్‌లు ఆడడమే కాకుండా, ఒకే ఓవర్‌లో మూడు వికెట్‌లు తీసిన ఘనత తను సొంతం చేసుకున్నాడు. కెప్టెన్‌గా నాయకత్వ లక్షణాలు కలిగి స్పిన్ బౌలర్‌గా జట్టులో పేరు సంపాదించుకున్నాడు. భారత దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 19 వరకు జమ్మూ కాశ్మీర్‌లో ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ప్రస్తుతం గుంటూరులో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు.



రఘు

జీవనోపాధికి వెళుతూ మృత్యువుపాలయ్యాడు!

శావల్యాపురం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన జాతీయ రహదారి మార్గంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని గంటావారి పాలెం గ్రామం పాముల కాలనీకు చెందిన కట్టా కామేశ్వరరావు (50) రోజు మాదిరిగా జీవనోపాధి నిమిత్తం వినుకొండకు బయలుదేరాడు. అయితే గ్రామ సమీపంలో రోడ్డు దాటుతుండగా వినుకొండ నుంచి గుంటూరుకు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడిని కారు యజమాని సత్వరమే స్థానిక ఆరోగ్య కేంద్రానికి స్థానికుల సాయంతో తీసుకొని వచ్చారు. అయితే అప్పటికే కామేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. స్థానిక పోలీసులు ఆరోగ్య కేంద్రానికి చేరుకొని శవపంచనామా కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



విలపిస్తున్న కుటుంబ సభ్యులు

అక్రమ మద్యం విక్రయదారుడి పట్టివేత

చిలకలూరిపేటటౌన్: ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు చేస్తున్న వ్యక్తిని రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై జి.రవి కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని యడవల్లి గ్రామం పరిధిలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లారు. ఉయ్యాల దానయ్య ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయాలు చేయడం గమనించి అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.